క్లుప్తంగా

శలాకకు ప్రతిష్టాత్మక పురస్కారం


శలాక రఘునాథశర్మ

సీటీఆర్ఐ: మహామహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార గ్రహీత ప్రాచార్య శలాక రఘునాథ శర్మ మరో పురస్కారానికి ఎంపిక అయ్యారు. హైదరాబాద్‌కు చెందిన శాంతా బయోటెక్ సంస్థ అధినేత డాక్టర్ కె.వరప్రసాద రెడ్డి స్థాపించిన శాంతా వసంత ట్రస్టు ఆధ్వర్యంలో అందించే వరప్రసాద్ రెడ్డి ఉత్తమ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్ తిలక్ రోడ్డులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఈ నెల 9న జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం ప్రదానం చేస్తారు.

రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి


రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కరించి, ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు సూచించారు. ఈ మేరకు గురువారం స్టేషన్‌ను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది పునర్నియామకం సత్వరం చేపట్టాలన్నారు. స్టేషన్ ఆవరణలో కుక్కల బెడదపై రైల్వే, మున్సిపల్ అధికారులు ఉమ్మడిగా చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రీపెయిడ్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పీవీ సుబ్రహ్మణ్యం, యానాపు ఏసు, ఎం.కృష్ణమాచార్యులు, తంగెళ్ల శ్రీనివాస్, పి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లాప్రగడ దంపతులు ధన్యజీవులు


విశ్వసుందరమ్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న వాణిశ్రీ తదితరులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో ఆనంద నికేతనాశ్రమం నెలకొల్పి ఎందరో దేశ భక్తులకు ప్రేరణ నిచ్చిన తల్లాప్రగడ దంపతులు ధన్యజీవులని లయన్స్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ ముదునూరు వాణిశ్రీ అన్నారు. ప్రముఖ స్వతంత్ర సమర యోధురాలు తల్లాప్రగడ విశ్వసుందరమ్మ 126వ జయంతి సందర్భంగా ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆమె ఎంతో కీలక పాత్ర పోషించారని, ఆరు నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు, పార్కు కార్యదర్శి రఘు పాత్రుని సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రక్షణ పరికరాల అందజేత

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్య కార్మికులు రక్షణ పరికరాలను తప్పనిసరిగా వాడాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిటిజన్ ఫీడ్ బ్యాక్ సేకరణ బృందాలు ప్రతి రోజూ డిగ్రీ కాలేజీలు, హాస్పిటల్స్‌ను సందర్శిస్తాయన్నారు. విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాస్, రామలింగారెడ్డి, సయ్యద్ ఖాసిం పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	సంక్రాంతికి వస్తున్నాం, 14 డేస్
సూర్యమినీ	మికీ 17, షివాంగి లైనెస్
సూర్యప్యాలెస్	కింగ్‌స్టన్
స్వామి	శబ్దం
శివజ్యోతి	మజాకా
అనుశ్రీ	మజాకా
రాజా	అగత్యా
ఊర్వశి	తండేల్
మేనక	నారి, పౌరుషం
రంభ	సీతమ్మ వాకిట్లో సిరిమల్లెచెట్టు
కుమారి	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
అశోక	చావా
నామవరం	
పీఎస్ మహల్	చావా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	చావా
కడియం	
వెంకటసూర్య	చావా

మేల్ జరిగేనా..

- పురుషులతూ పొదుపు సంఘాలు
- ప్రతి సంఘంలో ఐదుగురు సభ్యులు
- నగరంలో 130 గ్రూపులు
- జోరుగా జరుగుతున్న ప్రక్రియ


పురుషుల పొదుపు సంఘాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


పొదుపు సంఘాల నిబంధనలను తెలియజేస్తున్న అధికారి

సీటీఆర్ఐ: ఇప్పటి వరకూ పొదుపు సంఘాల పేరు వింటే మహిళలే గుర్తుకు వచ్చేవారు. ఆ సంఘాలకు వస్తున్న రుణాలు, వడ్డీ లెక్కలు, వాయిదాలు, సమావేశాల గురించి వారు చర్చించుకుంటూ కనిపించేవారు. ఇప్పుడు ఆ అవకాశం పురుషులకూ లభిస్తోంది. కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి, జీవనోపాధిని మెరుగు పరడానికి మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా స్వయం సహాయక మహిళా సంఘాల తరహాలోనే పురుషులతోనూ స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని నగరాలకు విస్తరణ

జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ (ఎన్‌యూఎల్ఎం) 2.0 పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రయోగాత్మకంగా విశాఖపట్నం, విజయవాడల్లో ఈ తరహా ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు అన్ని పట్టణాలు, నగరాలకు విస్తరించారు. దీనిలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నగరంలో ఇప్పటికే 130 ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేశారు. వారితో బ్యాంకు పొదుపు ఖాతాలను తెరిపించినట్లు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రామలక్ష్మి తెలిపారు. మహిళా సంఘాల మాదిరిగానే పురుషుల పొదుపు సంఘాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఆర్థిక సాయం అందించి, ఉపాధి కల్పించడం వంటి లక్ష్యాలను సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

ఐదుగురు సభ్యులతో ఒక గ్రూపు

మహిళా స్వయం సహాయక సంఘాల్లో పది మంది సభ్యులుంటారు. అయితే పురుషుల సంఘంలో ఐదుగురు సభ్యులుంటే సరిపోతుంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వలస కూలీలు, అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికులైన తాపీ మేస్త్రీలు, కార్పెంటర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్, కూరగాయలు, నిత్యావసరాల సరఫరా చేసే గిగ్ కార్మికులు, ఆటో రిక్షా కార్మికులు, హమాలీలు, తోపుడు బండ్లపై విక్రయాలు జరిపే చిరువ్యాపారులు, వృద్ధులు, పిల్లల సంరక్షణ కేంద్రాలు, ఇళ్లల్లో పని చేసుకునేవారు, ఇలా అనేక వర్గాలు వీటిలో సభ్యత్వం పొందే అవకాశం ఉంది.

ప్రతి నెలా పొదుపు

ప్రతి నెలా ఈ సంఘాలు సమావేశమై ఒక్కొక్క సభ్యుడు కనిష్టంగా రూ.100 నుంచి రూ.200 వరకు పొదుపు చేయాలి. ఆరు నెలల తర్వాత ప్రతి గ్రూపునకు పొదుపు మొత్తంలో ఆరు రెట్లు, రూ.లక్ష నుంచి ఆపై బ్యాంకు రుణాలు అందిస్తారు. ఈ సొమ్మును వృత్తి కుటుంబ అవసరాలు, ఉపాధిని మెరుగు పరచుకునేందుకు వినియోగించుకోవచ్చు. సభ్యులు సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లిస్తే మళ్లీ అదనపు రుణాలు పొందే అవకాశం ఉటుంది. మహిళా ఎస్‌హెచ్‌జీలకు ఇచ్చినట్లే బ్యాంకు లింకేజీ రుణాలు, పావలా వడ్డీ, సున్నా వడ్డీ రుణాలు వంటివి ఈ పురుష ఎస్‌హెచ్‌జీలకు వర్తిస్తాయని అధికారులు చెబుతున్నారు.

ఉద్దేశం మంచిదే కానీ.....

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో మహిళా స్వయం శక్తి సంఘాలు 9,211 ఉన్నాయి. వీటిలో 9 లక్షల మందికి పైగా సభ్యులు ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీరికి సున్నా వడ్డీ, పావలావడ్డీ వంటి రుణాలు అందేవి. అంతే కాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రుణమాఫీ చేసి డ్వాక్రా సంఘాలకు ఆర్థికంగా అండగా నిలబడింది. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 8 నెలలు పూర్తి కావస్తున్నా మహిళలకు రుణమాఫీ కానీ, పావలా వడ్డీ కానీ అందలేదు. అసలు డ్వాక్రా సంఘ సభ్యులకు రుణమాఫీ జరుగుతోందో లేదో తెలియదు. ఇప్పటి వరకూ కొత్తగా ఎవ్వరికీ బ్యాంకుల నుంచి అదనపు రుణం ఇవ్వలేదు. ఇదే తరహాలో పురుషుల పొదుపు సంఘాలకు కూడా రుణమివ్వడానికి బ్యాంకులు ముందుకు వస్తాయో లేదో తెలియన పరిస్థితి నెలకొంది.

ఆరు నెలల్లో రుణం



ఎలక్ట్రికల్ వర్కర్లు రోజూ సంపాదించే కూలిలో కొంత ఇంటిలో ఇచ్చి, మరి కొంత అప్పులు కట్టడానికి, ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. పురుషుల పొదుపు సంఘం ద్వారా ప్రతి నెలా కొంత మొత్తం పొదుపు చేస్తే ఆరు నెలల్లో బ్యాంకు రుణం పొందే అవకాశం ఉందని చెబుతున్నారు. బ్యాంకు నుంచి రుణం వస్తే పనికి అవసరమైన పరికరాలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది.

– కర్రి రాము, బాల గణపతి జేఎల్‌జీ ఎలక్ట్రికల్ గ్రూప్ అధ్యక్షుడు

80 గ్రూపులు ఏర్పాటు చేశాం



గోదావరి ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ ఆధ్వర్యంలో 80 గ్రూపులను ఏర్పాటు చేశాం. ప్రతి నెలా సభ్యులతో సక్రమంగా పొదుపు డబ్బులు కట్టించే బాధ్యత మేము తీసుకున్నాం. వర్కర్లకు రుణాలు మంజూరైతే, చాలా ఉపయోగంగా ఉంటుంది.

– ఎడ్ల శేఖర్, ఎలక్ట్రికల్ గ్రూప్ సెక్రటరీ

మహిళలకు ఎముకల పటుత్వ పరీక్షలు


పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు: ప్రతి మహిళా ఎముకల పటుత్వ పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ బోధనా సామాన్య ఆసుపత్రిలో గురువారం బోన్ డెన్సిటీ, నెఫ్రో క్రియాటినైన్ పరీక్షలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని సీఎస్ఆర్ కార్యకలాపాలలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. వీటిని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ సన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో 200 మంది మహిళలకు ఈ వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఎముక పగుళ్ల ప్రమాదాన్ని అంచనా వేయడానికి, ఎముకలకు నష్టం కలిగించే ఇతర వైద్య సంబంధ పరిస్థితులను ముందస్తుగా గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీసూర్యప్రభ మాట్లాడుతూ పరీక్ష నివేదిక ప్రకారం మందులు, ఇతర సూచనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, హాస్పిటల్స్ డీసీహెచ్ఎస్పీ పద్మశ్రీరాణి, సన్‌ఫార్మా మేనేజర్ ఎ.ఆనంద్ బాబు, వి.నాగ గణేష్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీని కలిసిన ఉపాధ్యాయ నాయకులు


టీచర్ ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడును కలిసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం వచ్చిన ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడును గురువారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు, ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘం నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రధాన సమస్య అయిన సర్వీస్ రూల్స్, పని ఒత్తిడి, ఆర్థిక బకాయిలపై ఎమ్మెల్సీకి విజ్ఞాపన అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసినప్పుడు ఉపాధ్యాయులు ఉమ్మడి సర్వీస్ రూల్స్, ఇతర సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డేనియల్ బాబు, సూరిబాబు, ఎస్‌ఎల్‌టీ జిల్లా అధ్యక్షుడు స్వామినాథన్, పండిత పరిషత్ జిల్లా నాయకుడు ఏసుబాబు, మున్సిపాలిటీ టీచర్స్ అసోసియేషన్ కెనడీ బాబు, ఆపస్ జిల్లా నాయకుడు రామ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన


పంచాయతీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీవో శాంతామణి

కడియం: తడి, పొడి చెత్త సేకరణపై గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పంచాయతీ అధికారి ఎం.నాగలతతో కలిసి గురువారం వేమగిరి, కడియం, జేగురుపాడు, మురమండ, దుళ్ల, వీరవరం, కడియపుసావరం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణకు సంబంధించి నిర్వహిస్తున్న ఇంటింటికి అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వాటి పని తీరును మెరుగుపరిచేందుకు సంబంధిత గ్రామ కార్యదర్శులకు సూచనలు చేశారు. డీపీవో శాంతామణి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 150 గ్రామ పంచాయతీలను ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ నెల మూడో వారం నుంచి ఈ సిస్టమ్ ద్వారా ప్రభుత్వం నేరుగా ఆయా ఇంటి యజమానులకు ఫోన్ చేసి అభిప్రాయ సేకరణ జరుపుతుందన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ ఎలా జరుగుతుంది, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు ఎలా ఉంది అనే అంశాలను తెలుసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కడియం మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్‌వీ రాంప్రసాద్, గ్రేడ్-1 కార్యదర్శులు రూప్‌చంద్, ఎ.శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.సత్యనారాయణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ధవళేశ్వరం సీఐ గణేష్
- ఘనంగా బహుమతుల ప్రదానోత్సవం


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీఐ గణేష్, డ్రీమ్స్ క్రీడోత్సవంలో కబడ్డీ పోటీల విజేతలు

ధవళేశ్వరం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ అన్నారు. ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్‌లో గురువారం జరిగిన డ్రీమ్స్ క్రీడోత్సవ్-2025 బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం సీఐ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాముఖ్యతను ఇస్తున్న డ్రీమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని వివరించారు. అన్నింటా రాణించి గ్రామంతో పాటు రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం డ్రీమ్స్ క్రీడోత్సవ్-2025లో క్రికెట్, రన్నింగ్, త్రో బాల్, కబడ్డీ తదితర క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాళ్లు వి.సంధ్యాకుమారి, జి.విమలారోజి, ఎస్.దీపిక, డ్రీమ్స్ ఫస్ట్ స్టెప్ ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.లలితాదేవి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర రాంబాబుకు డొక్కా సీతమ్మ అవార్డు


గుబ్బల రాంబాబుకు అవార్డు అందజేస్తున్న లక్ష్మీశ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం కేంద్రంగా 27 ఏళ్లుగా వృద్ధులు, అనాథలు, నిరాశ్రయులకు భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్న స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబుకు డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన అవార్డు లభించింది. అంతర్జాతీయ ఇన్నర్ వీల్ క్లబ్ రాజమండ్రి జిల్లా చైర్మన్ ఎ.లక్ష్మీశ్రీనివాస్ చేతుల మీదుగా ఆయన గురువారం అవార్డును అందుకున్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యుల ఈ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబును ఘనంగా సత్కరించి, అవార్డు బహూకరించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఉచిత అన్నదాన సేవలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా కోశాధికారి సౌందర్య, కార్యదర్శి తులసీలక్ష్మి, విశ్రాంత పశుసంవర్ధక వైద్యాధికారి మాటూరి రామకోటేశ్వరరావు, ఎస్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన పంచరత్న సేవ



పంచరత్న కీర్తనలను ఆలపిస్తున్న దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి 74వ సంగీత వార్షికోత్సవాలు గురువారం సాయంత్రం టి.నగర్‌లోని సమితి ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సమితి కార్యనిర్వాహక సభ్యుల జ్యోతి ప్రకాశనం తర్వాత పెద్దేపు సాయిబాబా బృందం నాదస్వరంతో కార్యక్రమానికి శుభారంభం పలికారు. అనంతరం 'ఎందరో మహానుభావులు, జగదానంద కారకా' తదితర పంచరత్న కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు వాడ్రేవు వెంకట రమణారావు, చైర్మన్ చింతలూరి సుందర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జోస్యుల సరస్వతి, కార్యనిర్వాహక కార్యదర్శి విశ్వనాథం భాస్కరరామ్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ నెల 18వ తేదీ వరకూ ఉత్సవాలు కొనసాగుతాయి.

నేడు వీణావాదం

సంగీత వార్షికోత్సవాలలో భాగంగా శుక్రవారం ద్విభాష్యం నగేష్ వీణావాదం నిర్వహిస్తారు. కమలాకర యోగీశ్ మృదంగం, సరస్వతుల హనుమంతరావు ఘటం సహకారం అందిస్తారు.

పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలి


వెలుగుబంటి రఘురామ్‌ను సత్కరిస్తున్న హెచ్ఎం, విద్యార్థులు

కడియం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం (నాని) సూచించారు. స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అధ్యక్షతన గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. నెల రోజులుగా పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట అల్పాహారాన్ని ఏర్పాటు చేసిన రఘురాంను పదో తరగతి విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం రూ.3 వేల విలువైన పెన్నులను విద్యార్థులకు వెలుగుబంటి నాని బహూకరించారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రఫీయుద్దీన్, సువర్ణవేణి, అక్షయమ్మ, పద్మశ్రీ పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టుపై పునరాలోచన చేయాలి


మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన మంత్రి మోడీ రాజకీయ కుట్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇరుక్కుంటున్నారని, దాని వల్ల రాష్ట్ర భవిష్యత్తు బుగ్గిపాలు కావటం ఖాయమని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. విభజన హామీలకు సంబంధించి రాష్ట్రానికి రావాల్సిన అనేక విషయాలను పక్కన పెట్టి.. బనకచర్ల ప్రాజెక్టుపై చంద్రబాబు దృష్టి సారించటం చారిత్రక తప్పిదం అవుతుందన్నారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం నిధులతో పూర్తి చేయాల్సిన పోలవరం ప్రాజెక్టు నేటికీ నత్తనడక నడుస్తోందన్నారు. చంద్రబాబు చెబుతున్న నదుల అనుసంధానికి ఒడిశా అనుమతి కూడా కావాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌కు రెండు రోజుల జైలు

కంబాలచెరువు: మద్యం తాగా వాహనం నడుపుతున్న వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ మూడో ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య గురువారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీ కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో రోడ్ యాక్సిడెంట్లను తగ్గించాలనే ఉద్దేశంతో మద్యం తాడి వాహనం నడుపుతున్న వారిని పట్టుకునేందుకు ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది వాహనదారులను పట్టుకున్నారు. ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష వేయగా, మరో 29 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2 లక్షల 90 వేలు జరిమానా విధించారు.

కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగినులకు ఆటల పోటీలు


బొమ్మూరు వైటీసీలో మహిళా ఉద్యోగులతో అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కమర్షియల్ ట్యాక్స్ మహిళా ఉద్యోగినులకు గురువారం ఆటలు పోటీలు నిర్వహించారు. బొమ్మూరులోని వైటీసీ ఆవరణలోనూ, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలోనూ జరిగాయి. కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ జె.నీరజ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి.నిర్మలా జ్యోతి, మేనేజర్ ఆర్‌వీ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. కాగా.. శుక్రవారం త్రోబాల్, కబడ్డీ, టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు కమర్షియల్ టాక్స్ మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి డీఎంఎం శేషగిరి, మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలను వినియోగించుకోవాలి


పారిశ్రామిక వేత్తలకు నమూనా చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ప్రకాశం నగర్: యూనియన్ బ్యాంక్ అందిస్తున్న రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ కేంద్రీయ కార్యాలయం రీజినల్ మేనేజర్ శ్రీపతి శ్రీనివాస్ అన్నారు. జాంపేట ఉమా రామ లింగేశ్వర కల్యాణ మంటపంలో గురువారం మెగా ఎంఎస్ఎంఈ ఔట్ రీచ్ (సూక్ష్మ ,చిన్న, లఘు, పరిశ్రమల యూనిట్లకు సంబంధించిన అవగాహన సదస్సు) నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ ఖాతాదారులు ఆర్థిక క్రమశిక్షణతో సిబిల్ స్కోర్ మెరుగు పరుచుకోవడం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా అర్హులైన 96 మంది పారిశ్రామిక వేత్తలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ వై.విశ్వేశ్వరరావు, కోనసీమ జిల్లా జీఎం పి.ప్రసాద్, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి జి.మురళీ పాల్గొన్నారు.

నిందితులకు జరిమానా

సీతానగరం: కారును ధ్వంసం చేసిన ఘటనలో మునికూడలికి చెందిన తీగిరెడ్డి ప్రసాద్, దాసరి జానకి రామ్‌లకు రూ.5,500 చొప్పున జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం సెవంత్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు గురువారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు జైలుశిక్షను విధించారు. వివరాల్లోకి వెళితే.. 2022 ఫిబ్రవరి 6న కొవ్వూరుకు చెందిన ఐదుగురు కారులో దేవీపట్నం మండలం గండిలో కొలువైన పోశమ్మ గుడికి వెళ్లారు. దర్శనం అనంతరం ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ఆ కారును రాజంపేట వద్ద తీగిరెడ్డి ప్రసాద్, జానకి రామ్ అడ్డుకున్నారు. తమకు దారి ఎందుకు ఇవ్వలేదంటూ కారును ధ్వంసం చేశారు. కారులోని వారిపై కర్రలతో దాడి చేశారు. కొవ్వూరుకు చెందిన కంచుమర్తి సత్తిబాబు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేశారు. పీపీ ఓలేటి మహాలక్ష్మి కేసు వాదించగా, మేజిస్ట్రేట్ బాబు పైశిక్ష విధించారు. ఎస్సై రామ్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ ఎస్కేబీఎం షరీఫ్ సాక్షులను సకాలంలో హాజరుపర్చినందుకు కోరుకొండ సీఐ సత్యకిషోర్ అభినందించారు.